# ఆదర్శానికి పోతే

శ్రీహరి పెద్దబ్బాయి పైసా కట్నం పుచ్చుకోలేదన్న వార్త దశదిశలా వ్యాపించింది. ఆయన ఆదర్శమూర్తి అనీ, గొప్ప సంఘసంస్కర్తగా కీర్తి సంపాదించారు. దరిమిలా ఆడపిల్లల తండ్రుల దాడి ప్రారంభమయింది. రెండోవాడికి ఇప్పుడప్పుడే పెళ్ళి చేయనని ఎంత బుర్ర మొత్తుకుంటున్నా ఎవరూ వినిపించుకోవడం లేదు. నిరీక్షణ జాబితాలోనైనా తమ సంబంధాన్ని చేర్చమని వేడుకుంటున్నారు. ఔనుమరి! శ్రీహరిగారి కోడలవాలంటే మజాకా కాదు. అందుకే ప్రతి తండ్రీ కన్నకూతురు అదృష్టాన్ని పరీక్షించుకోడానికి తాపత్రయ పడసాగాడు.

శ్రీహరి ఇంటికి వచ్చేపోయేవాళ్ళు రోజురోజుకి ఎక్కువవుతున్నారు. ఇహ ఆ ఇంటి పురోహితుడైన రామశాస్త్రి సంగతి చెప్పాలా? అతని గిరాకీ ఆకాశాన్ని చుంబించిందంటే నమ్మండి.తన పిల్లల్ని గురించి శ్రీహరి గారికి సిఫార్సు చేయమని బతిమాలాడుతూ అడక్కుండానే కానుక లర్పిస్తున్నారు. 'చూద్దాం, చేద్దాం' అనడం శాస్త్రి గారి వంతైంది.

జోగారావు రామశాస్త్రికి మిత్రుడేకాదు అత్యంత ఆప్తుడు. తను తిరుపతిలో వేదం అభ్యసిస్తున్న రోజుల్లో తన కుటుంబాన్ని ఉన్నంతలో ఆదుకుని ఆర్థిక సహాయం చేసాడు జోగారావు. అతడు చేసిన ఉపకారం తనీ జన్మలో మరచిపోలేడు.అతనిపట్ల రామశాస్త్రికి గల కృతజ్ఞతా భావము మాటలలో చెప్పడం కష్టం. ఏదోరకంగా ప్రత్యుపకారం చేసి అతడి ఋణం కొంతైనా తీర్చుకోవాలనుకున్నాడు. అందుకే అతని పెద్ద కూతురు లక్ష్మిని చేసుకుంటే లక్షణంగా వుంటుందని శ్రీహరి చెవిని ఇల్లు గట్టుకుని నచ్చచెప్పడం మొదలు

పెట్టాడు. నిజానికి పెళ్ళికి కావలసిన అర్హతలన్నీ లక్ష్మిలో మూర్తీభవించి ఉన్నాయి. రూపానికొస్తే దివి నుండి భువికి దిగిన దేవకాంతలా వుంటుంది. ఇక చదువులో సరస్వతీదేవిని మరిపిస్తుందన్నా అతిశయోక్తి కాదేమో! ఎటొచ్చి లక్ష్మీదేవే తన గడపకు ఆమడ దూరంలో వుంది.

జోగారావు మధ్య తరగతి వ్యక్తి. కట్నకానుకలు చెల్లించి కూతురికి పెళ్లి చేసే స్థితిలో లేడు. వంశపారంపర్యంగా సంక్రమించిన చిన్న పెంకుటిల్లు తప్ప అతడికి చెప్పుకోదగ్గ ఆస్తిపాస్థులంటూ ఏమీ లేవు. స్థిరమైన ఉద్యోగమేదైనా ఉందా అంటే అదీ లేదు. నాలుగు నగల దుకాణాలలో అకౌంట్లు రాస్తూ కాలాన్ని కరిగిస్తున్నాడు.

రామశాస్త్రి మీదున్న గౌరవం కొద్దీ పిల్లను చూడటానికి అబ్బాయిని వెంటేసుకుని జోగారావు ఇంటికొచ్చాడు శ్రీహరి.

జోగారావు ఆనందానికి అవధులు లేవు. కూతురి పెళ్లి అయిపోయినట్లుగానే సంబరపడిపోయాడు. పెళ్లివారిని సాదరంగా ఆహ్వానించి ఉన్నంతలో కాఫీ ఫలహారాలు పెట్టి గౌరవించాడు.

పిల్లను చూడటం, ప్రశ్నలడగటం లాంటితతంగం పూర్తి అయింది.

పిల్లవాడు పిల్లను నచ్చుకున్నాడని గ్రహించిన జోగారావు తృప్తిగా శ్వాస తీసుకున్నాడు. రామశాస్త్రికి కళ్ళతోనే కృతజ్ఞతలు అందజేశాడు.

తండ్రి కొడుకులు కాస్సేపు చెవులు కొరుక్కున్నారు.

"జాతకాలు భేషుగ్గా కలిసిపోయాయి" అన్నాడు రామశాస్త్రి.

అమ్మాయి లోనికి వెళ్ళిపోగానే శ్రీహరి వంక ఆశగా చూసాడు జోగారావు.

"మాకు అమ్మాయి నచ్చింది. ఇక మిగిలిన విషయాలు ముచ్చటించుకుంటే ముహూర్తాలు పెట్టేసుకోవడమే" అన్నాడు శ్రీహరి.

ఆ మాటకు కొంత సేపు అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది.

మిగిలిన విషయాలంటే ఏమిటో అర్థంగాక శ్రీహరి వంక అయోమయంగా చూశాడు రామశాస్త్రి.

"మాట్లాడుకునేందుకు ఇంకేమున్నాయ్? మీరు ఎప్పుడు పెళ్లిచేయమంటే అప్పుడు చేయడానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు జోగారావు నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ.

"మా వాడికి ఏనభై వేల వరకు కట్నమిస్తామంటూ వస్తున్నారు. ఇంతవరకు మాకు పిల్ల నచ్చక ఊరుకున్నాం."

శ్రీహరి మాటలకు జోగారావు గుండె దడదడలాడింది. ఎవరెస్టు శిఖరం

నుండి అగాధానికి త్రోయబడిన వాడిలా అయిపోయాడు.

"అయ్యా! తమకు కట్నాల మీద ఆశ లేదని జోగారావుగారితో చెప్పాను" అన్నాడు రామశాస్త్రి వారి సంభాషణలో జోక్యం చేసుకుంటూ.

"అలా అని మీతో చెప్పానా?" ఎదురు ప్రశ్న వేశాడు శ్రీహరి.

అతడి మాట పూర్తికాకుండానే, "అది కాదండి తమరు పెద్దబ్బాయి విషయంలో..."

"అప్పుడు అడగలేదు. ఇప్పుడు అడుగుతున్నాను. సరేనా? చెప్పండి జోగారావుగారూ తమరెంత ఇవ్వగలరో ఒక అంకె చెబితే...."

"క్షమించండి. కట్నాలిచ్చి ఆడపిల్లలకు పెళ్ళి చేసే స్థితిలో లేను" చేతులు జోడించాడు జోగారావు.

చటుక్కున లేచాడు శ్రీహరి.

చివుక్కుమన్నది రామశాస్త్రి మనసు.... హు.... డబ్బు మహిమ! ఎంతటి వాడినైనా ఇట్టే లొంగదీసుకునే శక్తి దానికుంది. అనవసరంగా తానీ సంబంధాన్ని జోగారావుకు చెప్పి స్నేహితుణ్ణి అవమానించాడు. 'ఛ.... మరెప్పుడు మనుషుల్ని నమ్మకూడదు' అనుకుని లెంపలేసుకున్నాడు. ఆదర్శభావాలున్న వ్యక్తి అంతలోనే ఎందుకిలా మారిపోయాడో అతడి కర్థంకావడంలేదు. మరి చేయగలిగిందేమీ లేక మౌనంగా అతడిని అనుసరించాడు.

"అయ్యా! తమరేమీ అనుకోనంటే ఒక్క ముక్క" అన్నాడు రామశాస్త్రి శ్రీహరి గడపలో అడుగుపెడుతూనే.

"అడగండి"

"కట్నాలంటే ద్వేషించే మీరీరోజు....."

"ఏం చేయమంటారు? కట్నం పుచ్చుకోవడం నాకెంతమాత్రం ఇష్టంలేదు. ఐనా తప్పనిసరి అవుతోంది. గతమారు పెద్దబ్బాయికి కట్నం పుచ్చుకోలేదన్న విషయం మీకు తెలుసు. పెళ్ళి ఖర్చులకు ఇరవై వేలు అడ్వాన్సు కావాలని మా కంపెనీ వాళ్ళకు కాగితం పెడితే తిరుగుటపాలో దానిని వాళ్ళు తిప్పికొట్టారు. అదేమంటే మగవాడి పెళ్ళికి రాబడే తప్ప ఖర్చేముంటుందని ప్రశ్నించారు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఇరకాటంలో పడిపోయాను. కనీసం పెళ్ళి ఖర్చులైనా పెట్టుకుంటానని ఆ పెద్ద మనిషిముందుకు రాలేదు. ముహూర్తం దగ్గరపడంతో ఏం చేయాలో తోచక మార్వాడీ వద్ద నూటికి పది రూపాయాల వడ్డీకి అప్పు తీసుకున్నాను. ఇప్పటికింకా

ఆ ఋణం తీరలేదు. ఇటువంటి పరిస్థితులలో మళ్ళీ ఆదర్శాలకు పోయి అప్పుకోసం ఇంకెవర్ని ఆశ్రయించమంటారు? అందుకే కట్నం పేరుతో పెళ్లి ఖర్చులకైనా ఓ పాతిక వేలు ఇస్తానంటాడేమోనని అడిగాను. నేను అన్నదాంట్లో పొరపాటేమైనా వుందా మీరే చెప్పండి" అన్నాడు శ్రీహరి.

రామశాస్త్రి నోట మాటరాలేదు. "వర్తమాన వ్యవస్థలో నాలాంటి వాడు కట్నాలు పుచ్చుకోకూడదనుకున్నా తప్పడం లేదు".

శ్రీహరి మాటలలోని ఆవేదనను అర్థంచేసుకున్న రామశాస్త్రి నిరుత్తరుడయ్యాడు.

● *అంజలి వీక్లీ, 24-9-93.* ●